JAGGER… RAJAHMUNDRY.

# దెయ్యంతో ఇంటర్వ్యూ

శ్రీ వలివేటి బాలకృష్ణశర్మ.

చలిగాలి శరీరంలో సూదులుగుచ్చి బాధిస్తూంది. భుజంమీద తడి ఆంగోస్త్రంలో ఎలక్ట్రిక్ కరెంటు ప్రవేశించినట్టు బాధిస్తూంది. కాలవనీరు నెమ్మదిగా నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. ఓచేతులో కమండలమూ రెండోచేతులో అభిషేకం చేసిన కొబ్బరికాయా; పువ్వులూ, తులసిదళాలూ పట్టుకుని నిమ్మళంగా నడిచివస్తున్నాను.

ఆ కొబ్బరితోట మలుపు తిరిగితే నాలుగుగజాలలో మాయిల్లు. కాని ఆ తోటలోనే పూర్వం మాతాతగారి కాలంనుంచి దయ్యాలు కాపర ముండేవి. పాలేరు వెంకాయని లాంతరు తీసుకురమ్మంటే వెధవ ఎక్కడో చచ్చిపోయాడు. శ్రీ సూక్తంతో ఏదో శ్లోకాలు మెల్లిగా నెమరువేస్తు ప్రతీ కొబ్బరిచెట్టూ జాగ్రత్తగా పరీక్షిస్తూ తప్పటడుగులు వేస్తున్నాను.

"ఏయ్. అలానుంచో" అది ఏ జన్మకిందటో కాలం చేసిన మా కామయ్య మాష్టారి కంఠధ్వని.

మాటాడకుండా నుంచున్నాను. కళ్ళుమాత్రం తెరవలేదు.

"చెయిన్లూ....ఒరే చెయిన్లూ...." ఎరిగున్నట్టు పిలుపు "ఆ! మాష్టారూ!....మీరేనా?" కళ్ళుమాత్రం తెరవలేదు. ఎలా తెరవడం! అది స్పష్టంగా కామయ్య మాష్టారి దయ్యం. "కళ్ళువిప్పవేం?...." నాభుజం చేత్తోపట్టుకుని కదిలించాడు. బలవంతంగా కళ్ళువిప్పాను. నాకెవరూ కనపడ లేదు. చలికంటె భయంవల్ల నా శరీరం మరీ వణికింది.

ఏమవుతే అయిందని మళ్ళా ముందుకు నడిచాను ధైర్యంగా.

"నుంచోమంటే నీక్కాదూ." వెనకనుంచి గట్టిగా పట్టుకున్నాడు.

వెనక్కుచూస్తే నాకంటె మూరెడు ఎత్తులో రెండుకాళ్ళు కన బడ్డాయి. ఆకాళ్ళమీద పెద్ద మఱ్ఱిచెట్టుకి మల్లె ఒకమనిషి నుంచున్నాడు. క్రిందకు కాళ్ళుతగులకుండా ఎలా నుంచున్నాడు చెప్మా?

"నావల్ల తమకు ఏంకావాలి స్వామీ" అన్నాను వొణుకుతూ.

"ఎక్కడనుంచి వస్తున్నావ్?"

"ఇలా భీమేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేసుకుని ఇంటికి వెళుతున్నాను."

"హుం! ఎంతకి ఒప్పుకున్నావ్!"—ఇదికూడా దెయ్యానికే కావాలీ?

"మామూలు రూపాయి ఇస్తారు. తమకి తెలియందేమిటి? కాని రూపాయి అరువుపెట్టారు స్వామీ."

దెయ్యం క్రిందికిదిగాడు. మామూలు మనిషిలాగే వున్నాడు. పాదాలు చూశాను. మామూలుగానేవున్నాయి. వెనక్కుతిరగలేదు, నోట్లో కోరలూ పగయిరాలూ ఏమీలేవు. ఓ ఖద్దరుచొక్కా తొడుక్కుని లుంగీకట్టుకుని మా అబ్బాయిలావున్నాడు.

"అబ్బాయ్! నన్ను ముట్టుకున్నావుగదా! ఇంకా తిండితినలేదు. ఇప్పుడు పోయి మళ్ళా ఈ చలిలో స్నానంచెయ్యనా? చెప్పు—పెద్ద వాడిని ఇలా నన్ను బాధపెట్టడం నీకేమయి...."

"ఇదుగో చెయిన్లూ....నువ్వు ఏమీ మాటాడకు. నాకు కోపం

[illegible]

ఓరి పీడి అధార్టీమండా! వే వెదు వెధవ! పట్టుమని పుణ్యాహవచన మన్నా చేయించలేదు. నన్ను ధిక్కరిస్తాడు! సరే ఇవాళ లేచినవేళ బాగులేదు....

"అవుతే, ఏం జెయ్యమంటారు బాబూ?"

"మాటాడకుండా నా వెంటరా."

నోరుమూసుకుని కూడావెళ్ళాను. మధ్యమధ్య శవాలు కాలుతు న్నాయి. ఎమికలు పోగులు—అస్తిపంజరాలు—ఆహా—నాఖర్మం ఈ వెధవ అభిషేకం ఎందుకు వప్పుకున్నాను రా దేవా అనిపించింది.

నానాసందులూతిప్పి దెయ్యం ఓ కొంపలో ప్రవేశించాడు. లోపల మంచివాసనవేసింది. చలిమాత్రం ఎమికలు కొరుకుతూంది.

దెయ్యంవెళ్ళి పడకకుర్చీలో కూచున్నాడు.

"కూర్చో...." అన్నాడు.

ఒక కర్రకుర్చీలో కూచున్నాడు.

"చలి ఎక్కువగా వుందిగదూ...."

"చిత్తం"

"ఆకోటుతీసి తొడుక్కో...."

"చిత్తం."

"ఏం, ఆలోచిస్తున్నావ్"

"ఏం లా....ఎప్పుడూ కోటుతొడుక్కోలేదు. నాకురాదు."

"తొడుక్కోవోయ్!" నిర్లక్ష్యంగా కసిరాడు.

లేచివచ్చి ఒక్కచెంపకాయ వేస్తాడేమో అని భయం వేసింది. కోటు ఎలాగో తొడుక్కున్నాను.

దెయ్యం, సిగరెట్టు కాలుస్తున్నాడు.

"చెయిన్లూ—నువ్వెందుకు ఇక్కడికి వచ్చావో తెలుసునా?"

"చిత్తం తమ ఆజ్ఞప్రకారం—అసలు నేనెవర్ని రావడానికీ మాన డానికిన్నీ....తమరే ఈడ్చుకొచ్చారు."

"అది సరేనోయ్! అసలు నువ్వు జీవించివుండడం నాకిష్టంలేదు."

"అసలు నాకూ యిష్టంలేదు" ధయిర్యంగా జవాబు చెప్పాను.

దెయ్యం మంచినీళ్ళుతాగడానికి లోపలికి వెళ్ళాడు. నన్ను చంప డానికి కత్తో తుపాకీయో తేవడానికేమో! నాకు గుండె దడదడకొట్టుకుంది. ఆమినిటుతో నా జీవితం పూర్తయిందని తెగించి కూచున్నాను. చేతులో వున్న కొబ్బరికాయముక్కలో కొంతభాగం తిని కమండలంలో నీళ్ళు త్రాగాను.

దెయ్యం మంగలికత్తితో పెనసలు చెక్కుతూ ప్రవేశించాడు. దెయ్యం మారిపోయాడు. పొట్ట కాస్త పెరిగింది. శరీరం లావెక్కింది. పూర్వపు దెయ్యాన్ని ఆరుచేత హెచ్చవేసినట్టుగావున్నాడు. ఎన్నిమంచి నీళ్ళుతాగినా ఇంత లావెక్కుతాడా? అల్లాంటి మంచినీళ్ళు ఓగ్లాసుతో దొరికితే నాభార్యని కాస్త లావెక్కించివుందును.

దెయ్యం కుర్చీలోకూచున్నాడు. ఆయాసంగా మాటాడుతున్నాడు

[illegible]

"అసలు వాళ్ళకి బ్రతకాలని లేదయ్యా!"

"అలాకాదు. వాళ్ళు వేదాంతులుగా, భక్తులుగా బ్రతకడం నాకిష్టం లేదు."

"రౌడీలుగా—దెయ్యాలుగా నీకు మళ్లే బ్రతకాలంటావ్. చూడూ పూర్వజన్మంలో ఏ పాపంచేశావో కాని ఈ జన్మలో ఇలా దెయ్యానివై పుట్టావు. ఇప్పుడయినా కాస్త పుణ్యంచేసుకో లేకపోతే మరీ వెధవజన్మ వస్తుంది. గరుడపురాణంలో ఏం వ్రాశాడో తెలుసా?"

నా ధయిర్యానికి వాకే ఆశ్చర్యం వేసింది.

"పుణ్యం చెయ్యడమంటే ఇప్పుడు నీకాళ్ళుకడిగి నెత్తిమీద జల్లుకుని నీకోరూపాయి చెల్లగట్టి అభిషేకం చేయించమంటావ్!"

"నాక్కాదు. భగవంతుడికి—నీరూపాయి ఎవడిక్కావాలి? మాకు డబ్బంటే లక్ష్యమా? బ్రతుకంటే ఖాతరా?"

"మీకంటే గజదొంగలు నయం. దొంగలకి ధనమంటే ఎక్కువ గౌరవం. ఆడబ్బు తనదగ్గర పెట్టుకుని మరీ జాగ్రత్తగా గౌరవించాలని వాళ్ళు దొంగతనం చేస్తారు. మీరో—డబ్బు పాపిష్ఠిది—అది ఎవరికీ, మీకూ, కూడా వుండకూడదంటారు. మీకంటె పచ్చి ఖూనీకోరు మంచివాడు. మానవజీవితంమీద వాడికెంతో మోజు. ప్రపంచంలో నీగ్నిఫికెన్సు లేని తుచ్ఛప్రాణాలూ బాధకలిగిస్తూన్న దుష్టజీవితాలూ నిలిచివుండడం ఇష్టంలేక కుళ్ళిపోయి బాధపెడుతూన్న అవయవాల్ని డాక్టర్ ఆపరేషను చేసినట్టు తెగవేస్తాడు. మీరు వాడికంటె అధములు. మానవజాతీ, ఆజాతితో సహా మీరూ, కూడా నశించిపోవాలని కోరుతారు."

దెయ్యం లేచినుంచున్నాడు. కోపంగావున్నాడు. పెనపలు క్రింద పెట్టి ఆకత్తి చేత్తోపట్టుకుని మాటాడుతున్నాడు.

"నీకంటె నీకొడుకు మంచి తెలివయ్యినవాడు. వాడు ప్రపంచానికి మరమ్మత్తు కావాలంటాడు కాని ప్రపంచం నశించిపోవాలనడు. అంతకంటె నేను తెలివయినవాడిని. ప్రపంచం నశించిపోయి కొత్త ప్రపంచం బయలుదేరాలంటాను. ఏమంటే మరామత్తు చెయ్యలేం గనక. నీకొడుకు నువ్వు ఒక్కడివి చచ్చిపోయి, ఇనపపెట్టె తాళం చేతికివస్తే చాలునంటాడు. నువ్వు మనస్సులో బ్రతకాలనివున్నా బయటకి—అంటే వేదాంతి బురఖాలో—అంతా నశించాలంటావు."

ఎంతో అనుభవంవున్న మీదటగాని దెయ్యం జన్మరాదు కాబోలు. దెయ్యం మాటాడుతూవుంటే గదిలోవున్న టేబిలూ కుర్చీలూ వొణుకుతున్నాయి.

"తమరు ఒక్కమాట చిత్తగించాలి. నేను వేదాంతినికాను. భక్తుణ్ణి."

"అంటే?"

"వేదాంతికీ భక్తుడికీ బేధంవుంది."

"చాల్లేవోయ్—తొండముదిరి ఊసరవిల్లి అయినట్లు భక్తుడు ముదిరి వేదాంతిగా తయారవుతాడు. భక్తుడిగావుండి దేవుడు పేరుమీద అమాయకుల డబ్బంతా గుంజుకుని పెట్టెతాళం మొలనికట్టుకుని "నేనే దేవుణ్ణి—దేవుడంటే ఎక్కడోలేడు" అని వాగుతాడు. ఇప్పుడు మీతెగ, చక్కలంలాగ వుంది. లోపలిఅంచు భక్తులు—పైఅంచు వేదాంతులూ.

వీరంతా మాటాడే టెక్నిక్ మాటలు—జన్మరాహిత్యం—కైంకర్యం ఇహపరసుఖాలూ—సుఖదుఃఖరాహిత్యం....వగైరాలు—ఈ సుఖదుఃఖరాహిత్యం ఓ అర్థంలో అతిఘోరం. బ్రతికివుండగా పొందగలిగేదికాదు. మృత్యువన్నమాట. మీరు ఎప్పుడు సుఖంపేరు ఉచ్ఛరించినా శరీరాన్ని వొణికించే మృత్యుదేవతపేరు చెబుతున్నారన్నమాట. మీరు ఏమీ చేతగాని హంతకులన్నమాట. శిక్షలేనిహంతకులు! ఏదయినా నేరం పుట్టకముందు శిక్ష పుట్టింది. దొంగతనంచేస్తే ఫలానాశిక్షవేస్తాం అన్నారు. మీరు నేరం

పాపం మానవులు పూర్తిగా అమాయకులు! ఒక బీదముష్టివాడు, అంధుడు, కాళ్ళూచేతులూలేనివాడు—ఎందుకూ పనికిరానివాడు—ఏమీ చేతగానివాడయినాసరే....తన గుమ్మంముందునుంచుని—రాగాలతో—తాళాలతో—"నువ్వు చస్తావు—నీ పెళ్లాం చస్తుంది—నీ సంసారం నశించిపోతుంది—నీ శరీరం మట్టిఅయి పూరుకుంటుంది—జాగ్రత్తా—" అని తెగవాగుతే—నోరుమూసుకుని వాడికో డబ్బు లంచంపెట్టుకుని సాగనంపుతాడు—మానవుడు....ఇండియా మానవుడు.

మన శాస్త్రాల్లో—సారస్వతంలో—సాంఘిక వ్యవహారాల్లో—ప్రతీవిషయంలో వేదాంతం-భక్తి. మనకు గ్రహణమంటే రాహువూ—మింగడం—విష్ణుమూర్తి రాహువుకి శరీరం లేకుండా చేసినమూలాన మళ్ళా గొంతుకలోంచి జార్చడం....ఇవన్నీ వస్తాయి. మనకు పూర్వులు వ్రాసిపెట్టిన ప్రబంధాలనిండా దేవుళ్ళూ వేదాంతాలూ—మనకు తెల్లవారి లేచింది మొదలు చేయవలసిన పనులు అగ్నిహోత్రమూ—దేవతార్చనా—

ఇతరదేశాల్లో సైన్సు ఎంత అభివృద్ధిచెందినా, సారస్వతం ఎంత మంచితోవతొక్కినా మనదేశంలో మాత్రం నీలాంటి బుర్రలకీ దేవుళ్ళకీ శాశ్వత అంతర్ధానం లేకుండావుంది.

ఇదంతా నిజమే కాబోలు అనిపించింది. కాని ఈ మాటలన్నీవిని, ఈ దెయ్యంచెప్పినట్టు హఠాత్తుగా మారిపోతే ఈ జీవితంలో ఇంకే పని చేతగాని నాబ్రతుకు ఎలా గడుస్తుంది? ఇది పెద్దప్రశ్న. ఈ వాతావరణంలో పెరిగి ఈ చదువు చదువుకుని జీవితం వ్యర్థం చేసుకున్నాక ఇప్పుడు ఇంకోపంథా ఎలా తొక్కేది?

"అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" దెయ్యాన్ని అడిగాను.

"నువ్వేమీచెయ్యలేవు. బ్రతకలేవు. అలా అని చావనూలేవు. చావకుండా బతక్కుండావుండు." దెయ్యం ఎంతలేసి మాటలంటూంది! నా అభిమానం చచ్చింది. దెయ్యం మళ్ళా చెప్పాడు.

"నీ కొడుకునిమాత్రం నీలాగ తయారుచెయ్యకు. కాఫీ త్రాగించు, సిగరెట్లు కాల్పించు. సినీమాలు చూపించు. పొలం అమ్మిపారేశి బి. ఏ. దాకా చదివించు ఇంటికిపో."

"చిత్తం, దారితెలీదు?"

"జ్ఞాపకంలేదూ. సరే కళ్ళుమూసుకో!"

దెయ్యం గద్దించాడు. కళ్లరెండూ గట్టిగా మూసుకున్నాను. నా తడీ తలమీద ఎగురుతూన్న నాలుగువెంట్రుకలద్వారా నా ప్రాణాలు బయటకు వచ్చాయేమో అనుకున్నాను. నా శరీరం గిరగిరా తిరిగింది. కాళ్ళు నేలని ఆనడంలేదు. దెయ్యం నా పిలకపట్టుకుని గిరగిరాతిప్పాడేమో అనుకుంటాను. కళ్ళుమాత్రం విప్పలేదు. నా శరీరం కదుల్తునట్టుగావుంది. మధ్య మధ్య ఏవోచెట్లూ, ఆకులూ శరీరానికి తగులుతున్నాయి. గభీమని పెద్ద ధ్వని వినిపించి నా ఎముకలు విరిగినై. కళ్ళు వాటంతట అవే తెరుచుకున్నాయి.

ఎదురుగా నాభార్య బెండకాయలు తరుగుతోంది. ఇంటోవస్తువులూ, మనుషులూ యధాప్రకారంగా వున్నారు. నాకోసం ఎవరూ ఏడ్చినట్టూ, బెంగపెట్టుకున్నట్టూ కనపడలేదు.

"ఏం సంధ్యావందనమూ చట్టుబండలూ ఏమీ అక్కర్లేదేమిటి ఇవాళ—" నా ప్రాణేశ్వరి దీర్ఘంతీసింది.

"అబ్బాయి కాఫీతాగాడా?"

"ఏదో ఏడిచాడు, మీకెందుకూ?"

"ఓ అణాఇచ్చి సిగరెట్లు కొనుక్కోమను. ఇవాళ సినీమాకు వెళ్ళమను."